www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
కరీంనగర్ | సంపుటి : 02 | సంచిక : 305 | ఆదివారం | 4 మే, 2025



## పత్తి కొనుగోళ్లలో 3వేల కోట్ల కుంభకోణం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణ
- సీఎం, ఉత్తమ్ హస్తం ఉందని విమర్శ

02



## హరిరామ్ ఆస్తులపై ఏసీబీ ఆరా

- హరిరామ్ వెనక ఉన్న వారి కూపీలాగే యత్నం

02

## కులగణన అంతా తప్పుల తడక

- ఎంపీ డీకే అరుణ ఫైర్

03



# ఉగ్రవాదం ప్రమాదకరం

### దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

- దానికి సహకరించేవారిని కూడా వదిలిపెట్టం
- మరోఆరు ఘూటు హెచ్చరిక చేసిన ప్రధాని మోడీ
- అంగోలా అధ్యక్షుడితో మీడియా సమావేశం

**మానవాళి మనుగడకు టెర్రరిజం అతి ప్రమాదకరమైనదని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు అని ప్రధాని మోడీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా అని అన్నారు.**

**న్యూఢిల్లీ, మే 3:** ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు అని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోదీ ప్రస్తావించారు. రెండు దేశాలు ఉగ్రవాదం తగదని నమ్ముతున్నాయి. టెర్రరిజాన్ని సపోర్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న దృఢనిశ్చయంతో ఉన్నాము. సరిహద్దుల దగ్గర టెర్రరిజాన్ని అరికట్టడంతో మాకు సహకరిస్తున్నందుకు అంగోలాకు కృతజ్ఞతలు అని ప్రదాని తెలిపారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడి నేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. మిగతా 2 లో



## పాక్‌కు షాక్

- సరుకుల దిగుమతిపై పూర్తి నిషేధం
- జాతీయ భద్రతా దృష్ట్యా నిర్ణయం
- దాయాదితో అన్ని సంబంధాలు తెంచుకుంటున్న భారత్

దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని, పాకిస్థాన్‌పై ఆర్థికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత ప్రభుత్వం పాక్ దిగుమతులపై నిషేధం విధించింది. ఈ నిషేధంతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది.

04

## హైదరాబాద్ చేరుకున్న మిస్ కెనడా



హైదరాబాద్, మే 3: హైదరాబాద్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న వివిధ దేశాల సుందరీమణుల రాక ప్రారంభమయింది. ఈ మిస్ వరల్డ్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6వ తేదీ నుండి హైదరాబాద్‌కు చేరుకుంటారు. మిస్ కెనడా మిస్ ఎమ్మా డీనా కాథరిన్ మోరిసన్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు శనివారం సాయంత్రం చేరుకున్నారు. శంషాబాద్‌కు చేరుకున్న మిస్ కెనడాకు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు.

02

## మిస్ వరల్డ్ పోటీలకు భారీగా ఏర్పాట్లు

- లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎస్ ఆదేశం




## గొర్రెల స్కామ్ నిందితులను వదలం

- మంత్రి సీతక్క హెచ్చరిక

02

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

- అవినీతికి చోటు లేకుండా కఠిన చర్యలు
- పేదలకే ఇళ్లు దక్కేలా చూసే బాధ్యత మాదే
- యువ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి సూచన



02



## ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ నం.1

02

- రైతులకు అందిస్తున్న సహకారంతోనే సాధ్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



## రంగనాయక సాగర్‌లో ప్రమాదం

- సరదాగా ఈత కొడుతూ ఇద్దరు గల్లంతు

02

సిద్దిపేట జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. చిన్నకోడూర్ మండలంలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో శనివారం ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు.

## రహదారుల అభివృద్ధితోనే పెట్టుబడులు సాధ్యం



- తెలంగాణలో రహదారుల విస్తరణకు కృషి
- రేపు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి గడ్కరీ రాక
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

02

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

2 కరీంనగర్ ఆదివారం 4 మే 2025

# మానవాళి మనుగడకు ఉగ్రవాదం ప్రమాదకరం

మొదటి పేజీ తరువాయి

అందుకు ఆ దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం అని మోదీ పునరుద్ఘాటించారు. ఇటీవల బిహార్‌లో జరిగిన కార్యక్రమంలోనూ మోదీ పహల్గాం దాడి గురించి ప్రస్తావిస్తూ గట్టి హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా అని అన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టు-ముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం .. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే దిశలో చర్యలు మొదలెట్టింది. సరిహద్దుల దగ్గర యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదం గురించి తరచుగా స్పందిస్తూనే ఉన్నారు. శనివారం కూడా ప్రధాని మోదీ ఉగ్రవాదంపై మాట్లాడారు. ఉగ్రవాదులపై .. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న వారిపై కఠినమైన చర్యలు



తీసుకుంటామని స్పష్టం చేశారు. అంగోలా ప్రెసిడెంట్ జావో లూరెన్కో రాక సందర్భంగా ఆయనతో ఢిల్లీలో ఉమ్మడి ప్రెస్ కాన్ఫిరెన్స్ జరిగింది. ఈ ప్రెస్ కాన్ఫిరెన్స్ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దాదాపు రెండు దేశాలు 40 ఏళ్లుగా భాగస్వామ్యంలో కలిసి ముందుకు నడుస్తున్నాయి. అంగోలా స్వాతంత్య్రం కోసం పోరాడుతున్నపుడు.. ఇండియా నమ్మకం, స్నేహంతో అండగా నిలిచింది. ఆఫ్రికన్ దేశాల నుంచి మాకు గత పదేళ్ళ ఎంతో వేగవంతమైన సహకారం అందింది. వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఎనిమిది దేశాల్లో ఒకేషనల్ -ట్రైనింగ్ సెంటర్లను తెరిచాము. ఓ ఐదు దేశాల్లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో సహకరిస్తున్నాం.. ఆఫ్రికాలో 17 కొత్త ఎంబసీలను తెరిచామని అన్నారు.

# పత్తి కొనుగోళ్లలో 3వేల కోట్ల కుంభకోణం

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణ

## సీఎం, ఉత్తమ్ హస్తం ఉందని విమర్శ



**హైదరాబాద్, మే 3:** పత్తి కొనుగోళ్లలో రూ. 3వేల కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల కుంభకోణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హస్తం ఉందని విమర్శించారు. రైతులు క్వింటాకు రూ. 2వేలు నష్టపోయారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం నాడు మీడియాతో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రైతు దగ్గర క్వింటాల్ పత్తిని రూ. 5వేలకు కొనుగోలు చేసి... బ్రోకర్లు రూ. 7 వేలకు పైగా దండుకున్నారని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. సీసీఐ, మార్కెటింగ్ అధికారులు పత్తి రైతులను మోసం చేశారని ఆరోపించారు. పత్తి కొనుగోళ్లను సీసీఐ ఆలస్యం చేయటంతోనే.. రైతులు నష్టపోయారని చెప్పారు. కేవలం 20శాతం మంది రైతులే సీసీఐకు పంటను అమ్ముకున్నారని అన్నారు. మిగిలిన పంటను కాంగ్రెస్ నేతలు సిండికేట్‌గా ఏర్పడి.. సీసీఐకు అమ్ముకున్నారని ఆరోపణలు చేశారు. దీపావళి సందర్భంగా.. హైదరాబాద్‌లోని ఓ హోటల్లో సీసీఐ అధికారులు, ట్రేడర్ల మధ్య జరిగిన రహస్య సమావేశంలో ఈ కుంభకోణానికి బీజం పడిందని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపణలు చేశారు.

# రంగనాయక సాగర్‌లో ప్రమాదం

## సరదాగా ఈత కొడుతూ ఇద్దరు గల్లంతు

**సిద్దిపేట, మే 3:** జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. చిన్నకోడూర్ మండలంలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో శనివారం నలుగురు గల్లంతయ్యారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. మృతులను మిరాజ్ (15), అర్బాస్ (15)గా గుర్తించారు. వరంగల్‌కు చెందిన రెండు కుటుంబాలు హైదరాబాద్ వెళ్తూ.. మార్గమధ్యంలో రంగనాయక్ సాగర్ వద్ద ఆగాయి. సరదాగా ఈత కొడుతుండగా.. వీరిద్దరూ నీట మునిగారు. కొద్దిసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు.. వారి కోసం ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. కొద్దిసేపటి తర్వాత మిరాజ్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. అర్బాస్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. స్థానికుల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటన స్థలంలో పోలీసులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గొర్రెల స్కామ్ నిందితులను వదలం

**మహబూబాబాద్, మే 3:** గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్కీముల పేరుతో స్కాములు చేసిన వారిని వదలమని మంత్రి సీతక్క హెచ్చరించారు. గొర్లు, చేపల పథకంలో సహా ఎందులో అవినీతి జరిగినా వదలమని అన్నారు. శనివారం కొత్తగూడ మండలం బత్తులపల్లిలో మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. గొర్రెల పంపిణీ స్కీములో డబ్బులు తీసుకున్న వారిని ముక్కుపిండి వసూల్ చేస్తామని అన్నారు. తమ ప్రభుత్వంలో ఈ గొర్రెల పథకాన్ని వినూత్నగా అమలు చేస్తామని ప్రకటించారు. రామప్ప వరల్డ్ హెరిటేజ్ కాబట్టి ప్రపంచ దేశాల సుందరీమణులను ఆహ్వానిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# బడుగువర్గాల ఆశాజ్యోతి దామోదరం

## 7న సంజీవయ్య వర్ధంతి వేడుకలు: విహెచ్

**హైదరాబాద్, మే 3:** బడుగు బలహీనవర్గాలకు చెందిన నేత దామోదర సంజీవయ్య అని మాజీ ఎంపి వీ. హనుమంతురావు కొనియాడారు. శనివారం నాడు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మే 7వ తేదీన దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించడానికి పార్టీ ముఖ్య నేతలు అంతా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ ఆవిష్కరణ కోసం అదే రోజు వారి గ్రామానికి వెళ్తున్నానని తెలిపారు. సొంత ఇల్లు లేని ఏ-కై-క ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దామోదర సంజీవయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో బలహీన వర్గాల కోసం దామోదర సంజీవయ్య ఎనలేని కృషి చేశారని ఉద్ఘాటించారు. నెక్లెస్ రోడ్డులో ఉన్న సంజీవయ్య విగ్రహానికి నివాళులు అర్పించడానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, శ్రేణులు భారీగా హాజరుకావాలని హనుమంతురావు కోరారు.

# హరిరామ్ ఆస్తులపై ఏసీబీ ఆరా



**హైదరాబాద్, మే 3 :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈఎన్‌సీ హరిరామ్ ఏసీబీ కస్టడీ కొనసాగుతోంది. ఇప్పటికే హరిరామ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈఎన్‌సీ హరిరామ్‌ను 5 రోజుల పాటు కస్టడీకి అనుమతిచ్చింది కోర్టు. శుక్రవారం హరిరామ్ ను చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబి కస్టడులోకి తీసుకుంది. ఏసీబీ ప్రధాన కార్యాలయంలో హరిరామ్ ఆస్తులపై ఏసీబీ ఆరా తీస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 13 కోట్ల రూపాయల ఆస్తులను గుర్తించింది ఏసీబీ. బహిరంగ మార్కెట్ వీటి విలువ పదిరెట్లు. వంద కోట్లకు పైగా హరిరామ్ ఆస్తులను గుర్తించింది ఏసీబి. మంగళవారం వరకు హరిరామ్ ను ఏసీబి విచారించనున్నది. కస్టడీలో భాగంగా హరిరామ్‌కు చెందిన లాకర్లను ఓపెన్ చేయనున్నది ఏసీబీ. లాకర్లు ఓపెన్ చేస్తే హరీరామ్ ఆస్తుల విలువ పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు. ఇంత భారీ స్థాయిలో ఆస్తులను కూడా పెట్టిన హరిరామ్ వెనకాల ఉన్నది ఎవరు అన్న కోణంలోనూ విచారిస్తోంది ఏసీబీ. హరి రామ్ ఇంట్లో సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల వివరాలు సేకరిస్తోంది. స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లపై ఉన్న పేర్లు, వారితో ఉన్న సంబంధాలు పై ఆరా తీస్తున్నారు అధికారులు. హరిరామ్‌కు పలువురు బినామీలు ఉన్నట్లుగా గుర్తించారు. బ్యాంకు అకౌంట్లు, డాక్యుమెంట్లు, బినామీలతో ఉన్న ఆస్తులు వివరాలను రాబట్టనున్నారు.



# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

## అవినీతికి చోటు లేకుండా కఠిన చర్యలు.. పేదలకే ఇళ్లు దక్కేలా చూసే బాధ్యత మీదే

## యువ ఇంజనీర్లకు మంత్రి పొంగులేటి సూచన

**హైదరాబాద్, మే 3:** పేదోడి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది రూ. 22వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. పైలట్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోందని అన్నారు. మిగిలిన గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక కొద్ది రోజుల్లోనే పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్‌లో శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు మంత్రి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. హౌసింగ్ కార్పొరేషన్‌లో 350 మంది ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆరు రోజులపాటు అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికెట్లు- అందజేశారు. అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. గ్రేడ్ -2లో పనిచేస్తున్న10 మంది సబ్ రిజిస్ట్రార్లను గ్రేడ్-1కి, సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న 11 మందికి గ్రేడ్-2 పదోన్నతులు కల్పించింది. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందరభంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదన్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు సక్సెస్ కావాలంటే యువ ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. ఇందిరమ్మ ఇండ్లకోసం శిక్షణ పూర్తిచేసుకున్న 390 మందియువ అసిస్టెంట్ ఇంజనీర్లంతా ఇందుకు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలా? ఇతర పార్టీలా అన్ని పార్టీల వారికి.. అర్హులైన పేదలకే ఇండ్లు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవారికి అందాలంటే అది పేద కుటుంబాల నుంచి వచ్చిన యువ ఇంజనీర్లకే తెలుసన్నారు. ఎవరూ ప్రలోభాలు పెట్టినా డబ్బుకు ఆశపడొద్దని హెచ్చరించారు. 600 చదరపు మీటర్లు లోపే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని.. ఎక్కు జాగలో ఇళ్లు కడితే తర్వాత వచ్చే డబ్బులు ఇవ్వబోమన్నారు. మొత్తం నాలుగు దశల్లో నిధులు విడుదల అవుతుందన్నారు పొంగులేటి. గ్రౌండ్ లెవల్ లో ప్రతి ఇంటిని పరిశీలించే బాధ్యత యువ ఇంజనీర్లదేనన్నారు. ప్రతి సోమవారం అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిధులు రిలీజ్ చేస్తామన్నారు. డబ్బులు రిలీజ్ చేశాక ప్రతి ఇంటిని పరిశీలిస్తామని చెప్పారు.

# గోవా లైరాదేవి ఆలయంలో తొక్కిసలాట

**పనాజీ, మే 3:** గోవాలోని లైరా దేవి ఆలయ జాతరలో జరిగిన తొక్కిసలాటలో ఆరు మంది మృతిచెందారు. మరో 50 మంది గాయపడ్డారు. శిర్గావ్‌లోని ఆ ఆలయంలో ఈ ఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున... సుమారు 4 నుంచి 4.30 నిమిషాల మధ్య ఆలయంలో భక్తులు ఒక్కసారిగా ఒకరిపై ఒకరు తోసుకున్నారు. అర్ధరాత్రి అగ్నిదివ్య అనే కార్యక్రమం జరిగిన తర్వాత తొక్కిసలాట చోటుచేసుకున్నది. జాతరలో భాగంగా ఆలయ సమీపంలోని అగ్నిగుండం చుట్టూ భక్తులు తిరుగుతూ తమ కోర్కెల్ని చెప్పుకుంటారు. అగ్ని దివ్య చుట్టు తిరగడం ఇక్కడ సంప్రదాయం. ఇక కొందరు ఆ నిప్పుల కుప్ప మీద నడుస్తారు కూడా. అయితే తొక్కిసలాట జరిగిన సమయంలో.. భక్తులు అక్కడే ఉన్నారా లేదో స్పష్టంగా తెలియదు. కానీ జనం కిక్కిరిసిపోవడం వల్ల తొక్కిసలాట జరిగినట్లు- ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

# మిస్ వరల్డ్ పోటీలకు భారీగా ఏర్పాట్లు

## లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎస్ ఆదేశం



**హైదరాబాద్, మే 3:** ఈ నెల 10వ తేదీ నుండి హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ 2025కు సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు సీనియర్ పోలీసు అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో శనివారం తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత స్థాయి ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూచించిన విధంగా చేపట్టిన ఏర్పాట్ల పై సవివరమైన నివేదికను అందించాలని సీఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుండి వచ్చే అతిథులకు ఎటు-వంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు- చేయాలని పోలీసు శాఖ ను ఆదేశించారు. విమానాశ్రయం, హోటల్స్, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే వేదికల వద్ద గట్టి భద్రతను కల్పించాలన్నారు. పోటీదారుల కోసం సవివరమైన బుక్‌లెట్ సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని జీహెచ్‌ఎంసి అధికారులను ఆదేశించారు. డీజిపి జితేందర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, ఇతర అధికారులు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# మోడీతో కాశ్మీర్ సిఎం భేటీ

**న్యూఢిల్లీ, మే 3:** జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం ఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. పహల్గామ్ ఉగ్రవాద ఘటన జరిగిన తర్వాత ఈ సమావేశం జరగడం ఆసక్తికరంగా మారింది. ఉగ్రదాడిపై ఇరువురు నేతలు చర్చించినట్లు అధికారులు తెలిపారు. మోడీ నివాసంలో దాదాపు 30 నిమిషాల పాటు భేటీ కొనసాగింది. భారత్, పాకిస్తాన్‌పై దాడి చేస్తుందని, పీఓకేని స్వాధీనం చేసుకుంటుందనే ఊహాగానాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యతన ఏర్పడింది. ఇటీవల పహల్గామ్‌లోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించారు. పాకిస్తాన్‌కి చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి బాధ్యత ప్రకటించింది. ఈ దాడిలో పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్ఐ ప్రమేయం ఉన్నట్లు- స్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

# ధాన్యం దిగుబడుల్లో తెలంగాణ నంబర్ వన్

**హనుమకొండ, మే 3:** ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల వైఖరికి ధాన్యం దిగుబడే నిదర్శమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని చరిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీకి మించిన సంక్షేమ పథకం మరొకటి లేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెరిఫై చేసిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని.. రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో చారిత్రక, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సన్న బియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్న ప్రభుత్వం తమదేనని.. ఎంత ఖర్చైనా సరే నిరుపేదలకు సన్న బియ్యం అన్నం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్, వ్యవసాయ శాఖలకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఇందులో భాగంగానే ఏ రాష్ట్రంలో పండని విధంగా తెలంగాణలో వానాకాలం, యాసంగిలో వరి పండిందని తెలిపారు. రాష్ట్రంలో 2.80 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని.. రెండు సీజన్లలో రబీ, యాసంగి సీజన్లలో సన్న ధాన్యానికి రూ. 500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ఇస్తోందని.. ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐకు ధాన్యం అమ్మే రాష్ట్రాల్లో తెలంగాణే ముందు వరుసలో ఉందని తెలిపారు. దేవాధుల ప్రాజెక్టును పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. దేవున్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్‌ను కూడా సందర్శించామన్నారు. భద్రకాళి చెరువు పునరుద్ధరణ పనులను, సుందరీకరణ పనులను భారీ స్థాయిలో చేపట్టామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేస్తున్నట్లు- తెలిపారు. ఈ శాఖలోని అన్ని సమస్యలను రెండేళ్లలో అధిగమిస్తామన్నారు. సీతమ్మసాగర్‌కు 68 టీ-ఎంసీల గోదావరి జలాలు కేటాయించామన్నారు. కేంద్రంతో అనేక సార్లు చర్చించి నీటి వాటాను దక్కించుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ఈ సీజన్‌లో పూర్తి చేస్తామన్నారు. రైతులకు నీరందించి సాగును సస్యశ్యామలంగా చేయడానికి కృషి చేస్తిన్నామన్నారు. రైతన్నల అద్భుతంగా పంటలను పండించారన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రైతుల నుంచి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు అందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం 4 మే 2025 | కరీంనగర్ | 3


# రహదారుల అభివృద్ధితోనే పెట్టుబడులు

- తెలంగాణలో రహదారుల విస్తరణకు కృషి
- రేపు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి గడ్కరీ రాక
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మే 3:** రహదారులు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోడీ పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 5న కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ తెలంగాణకు రానున్నారు. 5,416 కోట్ల రూపాయలతో 26 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు జరగనున్నాయి. నితిన్ గడ్కారీ అదిలాబాద్ , హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. రహదారుల అనుసంధానం అన్నింటికంటే ముఖ్యమైనదని చెప్పారు. వాజ్ పేయీ హయాంలో స్వర్ణ చతుర్భుజి పథకాన్ని తెచ్చారని, రోడ్ల నిర్మాణంపై లక్షల కోట్లు ఖర్చు ఎందుకని ఆనాడు కొందరు విమర్శించారని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేసిందని, కనెక్టివిటీ- కోసం మోడీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చుపెడుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్- శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్లు నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. హైదరాబాద్- విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. గత 10 సంవత్సరాలలో జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, అన్ని రాష్ట్రాలరాజధానులను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడానికి కేంద్రం కృషి చేస్తున్నది. ఈ నిర్మాణం వెనుక ఉన్న ముఖ్యమైన అంశం తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ. 2014 వరకు రాష్ట్రంలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ప్రస్తుతం 5,200 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ విస్తరణ తెలంగాణలోని 32 జిల్లా కేంద్రాల గుండా జాతీయ రహదారుల అనుసంధానానికి తోడ్పడిందని అన్నారు. హైదరాబాద్- శ్రీశైలం రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా ప్రయాణానికి సంబంధించిన దూరం తగ్గించబడుతుంది. దీనితో పాటు-, హైదరాబాద్- విజయవాడ మధ్య జాతీయ రహదారికి 6 లేన్‌ల నిర్మాణం కూడా జరుగుతుందని ఆయన చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో కొన్ని చోట్ల భూ సేకరణ సమస్యలు తలెత్తుతున్నాయి. భూ సేకరణ ఆలస్యం అయితే, నిర్మాణం కూడా ఆలస్యం అవుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఎంత త్వరగా భూమి సేకరించబడితే, అంత త్వరగా రహదారుల నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వేలాదిమంది కోట్లతో వందల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరుగుతుంది. తెలంగాణకు సంబంధించి 5 ప్రధాన కారిడార్ల నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని కిషన్ రెడ్డి తెలిపారు.




## హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

### కులగణన అంతా తప్పుల తడక వ్యవహారం

### మండిపడ్డ ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్, మే 3 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలు కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ..ప్రజల ఆకాంక్ష మేరకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన తప్పుడు కులగణన అని విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే కులగణన అనే మాట మాట్లాడారని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయిందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మొట్టమొదటి కులగణన 1931లో జరిగిందని ఎంపీ డీకే అరుణ గుర్తుచేశారు. ముస్లింలని బీసీ జాబితాలో చేర్చడం అంటే నిజమైన బీసీలను మోసం చేయడమేనని అన్నారు. 2026లో డీ లిమి-టె-షన్‌కి వెళ్తున్నామని అన్నారు. బీసీలు, ఓసీలకు నిజమైన న్యాయం చేసేది కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రమేనని చెప్పారు. జనగణనతో పాటు- కులగణన చేయడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక గొప్ప సంకల్పమని అన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి ఒక పేద కుటు-ంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలతో పాటు-గా ఎంపీలకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కోటాను కల్పించాలని.. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని ఎంపీ డీకే అరుణ వెల్లడించారు.



## 42సార్లు ఢిల్లీ వెళ్లినా ఏం లాభం

### ఉపాధి కూలీల పనిదినాలు తగ్గినా పట్టింపేది

### సిఎం రేవంత్‌పై హరష్ రావు విమర్శలు

**హైదరాబాద్, మే 3 :** ఉపాధి హామీ పనిదినాలు 2024-25 సంవత్సరానికి 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు తగ్గాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 సార్లు దిల్లీ వెళ్లినా ఉపాధి పనిదినాలు సగం తగ్గాయని విమర్శించారు. విషయం తెలిసినా కాంగ్రెస్, భాజపా ఎంపీలు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే కూలీల పనిదినాలు పెంచాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా.. తెలంగాణకు సాధించింది ఏం లేదని హరీష్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు జరిగే నష్టంపై నోరు మెదపకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మరోవైపు ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని.. వారి జీవితాలతో ఆడుకుంటు-ందని హరీష్‌రావు మండిపడ్డారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం రెండు కలిసి ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని హరీష్‌రావు ఆరోపించారు. రాష్ట్రానికి మంజూరైనా నరేగా పనిదినాలను కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించడం శోచనీయమని అన్నారు. 2024-25లో రూ.12.22 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా, ఈ సంవత్సరం కేవలం రూ. 6.5 కోట్ల పనిదినాలకే పరిమితం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నరేగా పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 4 నెలల వేతనాలు చెల్లించాలని హరీష్‌రావు కోరారు.

## ఆస్ట్రేలియా ప్రధానిగా ఆల్బనీస్

### వరుసగా రెండోసారి ఎన్నిక.. మోడీ అభినందన



**సిడ్నీ, మే 3:** ఆస్ట్రేలియా ప్రధానిగా ఆంథోనీ ఆల్బనీస్ వరుసగా రెండోసారి విజయం సాధించారు. ప్రతినిధుల సభలోని 150 స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు క్రమంలో అధికార లేబర్ పార్టీ ఇప్పటికే 86 స్థానాల్లో విజయం సాధించి.. మెజార్టీ మార్కు (76) దాటేసింది. శనివారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఆల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ గెలుపొందింది. దీంతో 2004 తర్వాత వరుసగా అధికారంలోకి వచ్చిన తొలి ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. మరో మూడేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నేత పీటర్ డట్టన్ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారు. తాము సరిగ్గా రాణించలేదని, ఫలితాల్లో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. ద్రవ్యోల్బణం, ఇంధన విధానాలు, ఇళ్ల కొరత, వడ్డీ రేట్లలో పెరుగుదల వంటి సమస్యలే ప్రధాన అంశాలుగా ఎన్నికలు సాగాయి. ఓటింగ్ అనంతరం.. ఆల్బనీస్ సర్కారే మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందనే అంచనాలు వెలువడ్డాయి. 2022 నుంచి ప్రధానిగా ఉన్న ఆయన.. మరో మూడేళ్లపాటు- ఆ పదవిలో కొనసాగనున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత సమయంలో.. ఆస్ట్రేలియన్లు ఆశావాదం, దృఢ సంకల్పాన్ని ఎంచుకున్నారని తన విజయ ప్రసంగంలో ఆల్బనీస్ తెలిపారు. వరుసగా రెండోసారి ఎన్నికైన ఆల్బనీస్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అఖండ విజయం సాధించి ఆస్ట్రేలియా ప్రధానిగా మరోసారి ఎన్నికైనందుకు అభినందనలు. ఈ తీర్పు మీ నాయకత్వంపై ప్రజల విశ్వాసాన్ని సూచిస్తోందన్నారు.ఇండో- పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వం కోసం మన ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేలా కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## పునరుజ్జీవన దిశగా ప్రాణహిత-చేవెళ్ల

### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**కామారెడ్డి, మే 3:** జిల్లాలోని మల్టీస్టేజ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన ప్రాణహిత-చేవెళ్ల పునరుజ్జీవన దిశగా సాగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అనంతరం మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి ప్రజల జీవనాధారం ఈ ప్రాజెక్టు అని పేర్కొన్న ఆయన, ప్రాజెక్టు పూర్తయితే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో రూ.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఇటీ-వల ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమీక్షలో కూడా ప్రాజెక్టు పురోగతిపై చర్చించామని తెలిపారు. కొండం చెరువు వద్ద ప్రాణహిత ప్రాజెక్టు ప్రాథమికంగా 0.80 టీ-ఎంసీలకు డిజైన్ చేయబడిందని, అయితే గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ దీనిని 3.5 టీ-ఎంసీలకు పెంచారని షబ్బీర్ అలీ వివరించారు. ఇది వల్ల 9 గ్రామాలు , తండాలు ముంపుకు గురవుతాయని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇటీ-వల జరిగిన సమీక్షలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సైతం అభ్యంతరాలు తెలిపారని వెల్లడించిన షబ్బీర్ అలీ, త్వరలో పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పురోగతిలో భాగంగా ప్రభుత్వంస్థాయిలో భూసేకరణకు రూ. 23.15 కోట్ల నిధులు విడుదల చేయబడ్డాయని షబ్బీర్ అలీ తెలిపారు. దీంట్లో భాగంగా మొదటి విడతగా 316 ఎకరాల భూసేకరణను చేపట్టనున్నట్లు-, మొత్తం 619 మంది రైతులకు పరిహారం చెల్లించే పక్రియ ప్రారంభం అయిందని పేర్కొన్నారు. తిమ్మక్‌పల్లి వద్ద 1.4 టీ-ఎంసీల పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తామని, వెంటనే రెండో విడత భూసేకరణ ప్రారంభమవుతుందన్నారు. మొత్తం ప్రణాళిక ప్రకారం కామారెడ్డి నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు.

## రైతును విస్మరించిన కాంగ్రెస్

### కాంగ్రెస్‌పై భ్రమలు తొలగిపోయాయి

**నిజామాబాద్, మే 3:** వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు ఉచితంగా ఎరువులు ఇవ్వడంలేదు. రుణమాఫీ సరిగా చేయలేదు. కనీస మద్దతు ధరకు పంటల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని శనివారం నాడిక్కడ తనను కలిసిన మీడియా మిత్రులతో అన్నారు. ఇందులో భాజపా పాత్ర కూడా ఉందని ఆరోపించారు. తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ పాలన ప్రమాదకరంగా మారిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. అన్నదాతలకు బిఆర్ఎస్, కెసిఆర్ ఎప్పుడూ అండగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ఏర్పాటు వల్ల రైతులు, వారి కుటుంబాలు బాగుపడ్డాయని అన్నారు. ఒక్కకెసిఆర్ మాత్రమే రైతులకు మేలు చేయగలరని ప్రజలకు కూడా తెలిసిపోయిందని అన్నారు. రైతుల్ని ఆత్మగౌరవంతో బతికేలా చేయాల్సిన ప్రభుత్వం దాన్ని విస్మరించి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులను కల్పిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధార పడ్డారు. అది ప్రమాదం అంచున ఉంది. వ్యవసాయాన్ని కాపాడు కోవడం ద్వారా తెలంగాణ సమాజాన్ని కాపాడాలనే లక్ష్యంతో కెసిఆర్ అనేక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. రైతు ఆత్మగౌరవంతో బతికేందుకు కావాల్సిన అన్ని రకాల నిర్ణయాలు తీసుకున్నారు. రుణమాఫీ, గిట్టుబాటు ధర, పంటలకు బీమాపై బిఆర్ఎస్ అనేక చర్యలు తీసుకోగా ఇప్పుడు ప్రచారాలతో కాంగ్రెస్ కాలం గడుపుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి వేలమంది రైతులు, విద్యార్థులు బలయ్యారని అన్నారు.

## అధికారిపై చేయిచేసుకున్న కార్పోరేటర్‌పై కేసు



**హైదరాబాద్, మే 3:** అధికారిపై చేయిచేసుకున్నం దుకు గాను భాజపాకి చెందిన కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌పై అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిపై రాకేశ్ జైస్వాల్ దాడి చేయడంతో.. ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడ్డారని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ స్పందించారు. అధికారులపై దాడులు చేస్తే సహించబోమన్నారు. అధికారులను పిలిచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు- అబిడ్స్ పోలీసులు కమిషనర్‌కు వివరించారు.

## కులగణన ఆత్మగౌరవ వ్యవహారం

### కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించిన తేజస్వీ యాదవ్

**పాట్నా, మే 3:** త్వరలో చేపట్టబోయే జనాభా లెక్కలతోపాటే.. కులగణన కూడా చేపడతామని కేంద్రం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ ప్రకటనను ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్ స్వాగతించారు. ఈ నిర్ణయం.. దేశం సమానత్వంవైపు సాగే ప్రయాణంలో మార్పును తీసుకొచ్చే క్షణమని తాజాగా తేజస్వియాదవ్ ప్రధాని మోడీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కులగణన కేవలం సమాచారానికి సంబంధించిన అంశమే కాదు.. అనేక మంది ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని ఆయన లేఖలో తెలిపారు. అయితే కులగణన సర్వేను కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తగా నిర్వహించాలని తేజస్వియాదవ్ సూచించారు. కులగణనకు సంబంధించిన డేటాను వ్యవస్థాగత సంస్కరణలు చేయడానికి ఉపయోగిస్తారా లేదా మునుపటి కమిషన్‌ల నివేదికల మాదిరిగానే ఉంచేస్తారా అని ప్రధానిని ప్రశ్నించారు. కులగణన చేపట్టాలని ఎన్నో ఎళ్లుగా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా ఎన్‌డిఎ ప్రభుత్వం పట్టించుకోకుండా దేశ ప్రజల్లో విభజనలు సృష్టించడం సరైన చర్య కాదని తేజస్వి తన లేఖలో పేర్కొన్నారు. మొదటగా బీహార్ కుల సర్వే చేపట్టినప్పుడు కేంద్రం పదేపదే దానిని అడ్డుకుంది. అయినప్పటికీ ఇప్పటికైనా కేంద్రం సరైన నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనివల్ల సమాజంలో చాలాకాలంగా అణచివేతకు గురవుతున్న ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జనగణన డేటా సామాజిక రక్షణ, రిజర్వేషన్ విధానాల సమగ్ర సమీక్షకు ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. అదేవిధంగా రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని కూడా పునఃపరిశీలించాలని తేజస్వి కేంద్రాన్ని కోరారు.



సంపాదకీయం



# మద్యం నియంత్రణతోనే నేరాలకు అడ్డుకట్ట!

భారీగా మద్యం అమ్మకాలు సాగాలన్నదే ప్రభుత్వాల లక్ష్యంగా ఉంది. మద్యంతో ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ప్రభుత్వాలు గమనించడం లేదు. మద్యం ఆదాయంతో కిలో రూపయి బియ్యం, పెన్షన్లు ఇవ్వడానికి, ఉచిత పథకాలకు ప్రభుత్వాలు అలవాటు పడ్డాయి. అందుకే మద్యనిషేధాన్ని అమలు చేయడం లేదు. తాగి చచ్చినా ఫర్వాలేదు... మద్యం అమ్మకాలు సాగాలి.. ఆదాయం పెరగాలన్న ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఇందుకు భిన్నంగా లేవు. నిజానికి ఉచిత పథకాలు ఆపితే మద్యం అమ్మకాల వైపుచూడాల్సి రాదు. తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలపై అదుపు లేకుండా పోతోంది. మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయ వనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చి పెడుతోంది. మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. మత్తులో ఉన్న వారిలో దూకుడు స్వభావం, విపరీత ధోరణి ఉంటుంది. ఇదే నేరాలకు దారి తీస్తోంది. విపరీత ప్రవర్తన, సమాజంపై ద్వేష భావం ఉండేవారికి మద్యం మత్తు తోడైతే అది తీవ్రమైన నేరాలకు కారణమవుతుంది. అందువల్ల మద్యం,గంజాయి లభ్యం కాకుండా అరికట్టే మార్గాలు ఆలోచించాలి. అకృత్యాల కట్టడికి ఏం చేయాలన్నది చర్చించాలి. మహిళలపై లైంగిక నేరాలు, అత్యాచారాలకు పాల్పడుతున్న వారిలో మద్యం మత్తులో ఉన్నవారెందరన్నది గణాంకాలు తీయాలి. అలాగే ఎక్కడపడితే అక్కడ మద్యం లభిస్తోంది. దీనికి తోడు గంజాయి లభ్యత కూడా పెరిగింది. చెడు సావాసాలతో మత్తులో మునిగి నేరాలకు పాల్పడుతున్నారు. దీనికంతటకీ నిరుద్యోగం, పనులు లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఇవన్నీ అరికట్టేందుకు ఏం చూయాలో ఆలోచించి ముందుకు కదిలితేనే నేరాలను అరికట్టగలం. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడుతోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చినప్పుడు నాటి సిఎం జగన్ హామీ ఇచ్చి డొల్ల కంపెనీల బ్రాండ్లతో వేలకోట్లు సంపాదించారు. మద్యం కుంభకోణంపై ఇప్పుడు సిట్ విచారణ సాగుతోంది. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. పార్టీ ఏదైనా.. కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు. అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగు తున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యూపిలో కూడా జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది. వారికి కఠిన శిక్షలు అమలు చేయాల్సి ఉంది. ఏదైనా అరాచక సంఘటన జరిగినప్పుడు ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచనచేయాలి. ఇకపోతే ఇటీవల చోటు చేసుకుంటున్న సామూహిక అత్యాచార ఘటనలను చూస్తే సామాన్యలకు కూడా భయమేస్తోంది. బయటకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లలను కూడా వదలడం లేదు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించి కొంత ఊరటను కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలన్నింటికి మద్యపానం, మాదక ద్రవ్యాల వాడకం అన్నది ప్రధాన కారణమవుతోంది. పోలీసలు దర్యాప్తుల్లో ఇదే తేలుతోంది. మద్యం మత్తులో ఉండే వ్యక్తికి అదే మైకంలో ఉన్న మరో ఇద్దరు, ముగ్గురు తోడైతే వారి పశుత్వానికి అడ్డూ అదుపు ఉండదు. అలాంటి సందర్భాల్లో వారికి నిస్సహాయంగా, ఎదురించలేని స్థితిలో మహిళలు ఎవరైనా కనిపిస్తే అఘాయిత్యానికి తెగబడతారు. తాను ఒక్కడినే కాదని.. తనతో పాటు మరి కొందరు ఉన్నారన్న భరోసాతో మరింతగా రెచ్చి పోతారు. తమవల్ల వారికి ఏమవుతుందో అన్న భయం కానీ..తరవాత తామేవుతామో అన్న ఆలోచనకానీ ఆ సమయంలో ఉండదు. అందువల్ల యువతకు పని కల్పించడం, ఖాళీగా లేకుండా చూడడం, మద్యంపై నియంత్రణ విధించడం అవసరం అని పాలకులు గుర్తించాలి.

# పాక్‌పై భారత్ మరో ఆర్థిక దాడి



**న్యూఢిల్లీ, మే 3 :** దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని, పాకిస్థాన్‌పై ఆర్థికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత ప్రభుత్వం పాక్ దిగుమతులపై నిషేధం విధించింది. ఈ నిషేధం విదేశీ వాణిజ్య విధానం 2023లో భాగంగా కొత్త నిబంధనగా చేర్చబడింది. దీనిలో భాగంగా, పాకిస్థాన్ నుంచి ఉత్పత్తులు దిగుమతి చేసుకునే లైసెన్సులను రద్దు చేయడం, ఎలాంటి సరుకుల ప్రవేశానికి అనుమతి ఇవ్వకపోవడం వంటి చర్యలు తీసుకున్నారు. ఈ నిషేధంతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం పడే అవకాశముంది. భారత ప్రభుత్వం ఈ చర్యను అంతర్జాతీయ వేదికలపై కూడా న్యాయబద్ధంగా నిలబెట్టే ప్రయత్నం చేయనుంది. ఉగ్రవాదంపై పోరులో ఇది ఒకటని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సంబంధాలు మరింత దిగజారాయి. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి అన్ని రకాల దిగుమతులపై నిషేధం విధించింది. జాతీయ భద్రత, ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిషేధం వెంటనే అమలులోకి వచ్చింది. రవాణాలో ఉన్న వస్తువులతో సహా పాకిస్థాన్ నుంచి వచ్చే లేదా ఆ దేశం నుంచి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులపై వర్తిస్తుంది. ఈ క్రమంలో పాకిస్థాన్‌లో లేదా అక్కడి నుంచి ఎగుమతి చేయబడిన అన్ని వస్తువుల దిగుమతి లేదా రవాణా అన్నీ కూడా వెంటనే నిషేధించబడతాయి. ఈ నిషేధానికి మినహాయింపు కోసం భారత ప్రభుత్వం ముందస్తు అనుమతి అవసరమని వాణిజ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో దాయాదితో అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న భారత్ ఇలా మరో గట్టి షాకిచ్చింది. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా సరే పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతించబోం. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే.. భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ-వాఘా సరిహద్దు. ఇప్పటికే దాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇక, 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దాయాది నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ఎ÷-లాస్టిక్స్, విలువైన లోహ సమ్మేళనాలు, మినరల్ ఫ్యుయల్స్, నూనె ఉత్పత్తులు, కొన్ని రకాల పిండి పదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణ ద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. ఇప్పుడు భారత్ వాటిపై నిషేధం విధించడంతో పాక్‌లో ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది. మరోవైపు, పాకిస్తాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆ దేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విధించింది. భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు మన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో మూడ్రోజులు వర్షాలు

పలు జిల్లాలకు వాతావరణశాఖ హెచ్చరిక



**హైదరాబాద్, మే 3:** తెలంగాణలో వాతావరణం ఒక్కోలా మారిపోతుంది. అప్పటి వరకు వేడి గాలులు, ఎండవేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు సాయంత్రం కాగానే చల్లటి వాతావరణం ఉపశమనాన్ని ఇస్తోంది. అంతేకాకుండా ఉన్నట్టుండి వర్షాలు కూడా పడుతున్నాయి. ఉదయం ఎండగా ఉంటూ.. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ఇదిలా ఉండగా.. తెలంగాణలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటనచేసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు ముంచెత్త నున్నట్లుపేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం పూట ఎండలు దంచికొట్టినప్పటికీ సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. ఈదురుగాలులతో కూడిన వర్షం పడనున్నట్లు- వెదర్ రిపోర్ట్ చెబుతోంది. రాష్ట్రంలో ఏయే జిల్లాలో వర్షాలు పడతాయనే విషయాన్ని కూడా వాతావరణ వాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ నల్లగొండ, వరంగల్, జనగాం, సూర్యాపేట, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమంగా ఉండగాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలకు రైతులు అల్లాడిపోతున్నారు. ఇటీ-వల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం కురవగా.. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రాకముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు బాధ వర్ణణాతీతమనే చెప్పుకోవాలి. ఈదురుగాలలు, ఉరుములు, మెరుపులతో పాటు- వడగళ్ల వర్షంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది.




# వర్షాలతో కల్లాల్లోనే తడిసిన ధాన్యం

పలుచోట్ల నీట మునిగిన పంటలు

**ఖమ్మం, మే 3:** రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఓ పక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తుంటే .. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కాంటాల కోసం రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. రోజుల తరబడి వడ్లు కాంటా పెట్టకపోవడంతో ఆరిన వడ్లు మళ్లీ.. తడుస్తుండడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాంటాలు పెట్టించడంలో ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సెంటర్లు ఏర్పాటుచేసి కాంటాలు పెట్టేలోపే వాన పడడంతో ఇబ్బందులు తలెత్తాయని అన్నారు.. ఈ పరిస్థితుల్లో కొన్ని చోట్ల కాంటాలు పెట్టడం ఆలస్యం అయ్యింది. కాంటాలు చేయటంలో ఎక్కడా ఆలస్యం చేయడం లేదన్నారు. సకాలంలో కాంటాలు పెట్టి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు వాపోతున్నారు. మా ఆరుగాలపు శ్రమ ఫలించింది. పంట చేతికొచ్చింది. తేమ కోసం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టాం. ఒకటి రెండు రోజుల్లో కాంటాలు వేస్తే ఇక ఫలితం చేతికొచ్చినట్లే..' అనుకున్న అన్నదాతలను గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అంతులేని నష్టాన్ని మిగిల్చింది. కూసుమంచి మండలంలో నష్ట తీవ్రత అధికంగా ఉంది. చేగొమ్మ గ్రామంలో ధాన్యపు రాసులు నీట మునిగాయి. గాలిదుమారానికి ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షానికి ధాన్యమంతా తడిచిముద్దయింది. అలాగే, మరో 10 రోజుల్లో కోయాల్సి ఉన్న మామిడి పండ్లు కూడా ఈదురుగాలులకు నేలరాలాయి. కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ, కల్లాల్లోనూ ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. తన ఏడాది కష్టాన్ని సుమారు గంటపాటు- వచ్చిన ఈదురుగాలి, వర్షం నేలపాలు చేశాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

# పెరుగుతున్న నిత్యావసర ధరలు

చోద్యం చూస్తున్న ప్రభుత్వాలు



న్యూఢిల్లీ, మే 3: అడ్డూ అదుపు లేకుండా పెరుగుతన్న నిత్యావసరాల ధరలు సామాన్య,మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఉప్పు, పప్పు, నూనె, పెట్రోల్.. ఇలా అన్నింటి ధరలు అందనంతగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మందుల ధరలు కూడా సైలెంట్‌గా పెంచేశారు. ఇప్పుడు సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ధరలు మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. వ్యాపారులు కూడా సమయం చూసి ధరలు పెంచేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు దాడి చేస్తున్నాయి. పెట్రో ధరలతో అన్నిరకాల వస్తువుల ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. చాయ్ సింగిల్ కనీసం 15 రూపాయలుగా అమ్ముతున్నారు. మూడేళ్లలో నెలసరి ఇంటి ఖర్చులు ఏకంగా 5 వేలు దాటేశాయి. ఈ ధరాఘాతంతో బతకలేక సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ ధరలకు తోడు కరెంటు బిల్లులు, పెట్రోల్ బాదుడు కూడా అదనంగా వచ్చి చేరింది. ప్రభుత్వాలు ధరలను అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. ధరలు పెరగడం సహజం అన్న ధోరణిలో ఉన్నారు. తమకు అందుబాటులో ఉన్న పెట్రోల్, గ్యాస్, విద్యుత్ తదితర వస్తువులపై వడ్డింపులు వేస్తూనే ఉన్నారు. దీనికితోడు జిఎస్టీ వడ్డింపులు శరాఘతంగా మారాయి. సామాన్యులు బతకడం దుర్లభంగా మారింది. ధరల పెరుగుదలను తలచుకుంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి ఖర్చు సగటున నెలకు రూ.5వేలకు పైగా పెరిగింది. ప్రతి ఒక్కరిపైనా ఏటా 5 నుంచి 10 శాతం పెంపుతో అదనపు భారం తప్పదు. పంటలు దెబ్బతిని గ్రామాల్లో ఉపాధి కరవైంది. అటు పనుల్లేక, ఇటు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు, మినపప్పు, పెసరపప్పుల ధరల్లో పెరుగుదల అధికంగా ఉంది. కరోనా సమయంలో ధరలు భారీగానే పెరిగినా తర్వాత కాస్త నెమ్మదించాయి. కొంతకాలంగా నిలకడగా సాగుతున్నాయి. గతంలో 3 నెలలకు రూ.333 ఉండే రీఛార్జ్.. ఇప్పుడు రూ.666కు చేరింది. దీనికి తోడు వై-ఫై రూపంలో నెలకు రూ.500 వరకు అదనపు భారం తప్పట్లేదు. కేబుల్ టీవీ ఖర్చు రూ.250 వరకు అదనం. ఒక్కో ఓటీటీ ఛానెల్‌కు సగటున రూ.500 చొప్పున నాలుగు తీసుకున్నా.. రూ.2 వేలు. అంటే నెలకు రూ.166 చొప్పున ఖర్చవుతుంది. ఒక్కో కుటుంబంపైనా మొబైల్, కేబుల్ బిల్లుల రూపంలోనే నెలకు రూ.2వేల వరకు అవుతోంది. వై-ఫై, ఓటీటీ తీసుకున్న కుటుంబాలకు నెలకు రూ.1,000 చొప్పున తప్పట్లేదు. 2019 మధ్యలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.600 వరకు ఉంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.950అయింది. అప్పటితో పోలిస్తే రాయితీ కూడా తగ్గిపోయింది. రూ.15 చొప్పునే నామమాత్రంగా ఇస్తున్నారు. నెలకు ఒక సిలిండర్ లెక్కన చూస్తే.. ఒక్కో కుటుంబంపై రూ.372 చొప్పున భారం పడుతోంది. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించైతే చెప్పనక్కర్లేదు. చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులకు ద్విచక్రవాహనం భారమైపోయింది. నెలకు సగటున 25 లీటర్ల పెట్రోల్ లెక్కన చూసినా రూ.1,100 వరకు ఖర్చు పెరిగింది. 2019లో రూ.75లోపు ఉన్న పెట్రోల్ ధర.. ప్రస్తుతం రూ.121 వరకు చేరింది. లీటరుకు రూ.45కు పైగానే పెరిగింది. ఇంజిన్ ఆయిల్ ధర రూ.300 నుంచి రూ.500కు చేరింది. ఇప్పుడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మరింత ఎగిశాయి. బ్రాండెడ్ టీపొడి ధర గతంలో కిలో రూ.540 ఉండేది. ప్రస్తుతం రూ.780 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, యాలకులు, తులసి, అశ్వగంధ వంటి ఉత్పత్తులతో తయారయ్యే ఒక సంస్థ టీ పొడి.. 2019లో రూ.380 ఉండేది. ప్రస్తుతం రూ.560కి చేరింది. లీటర్ పాల ధర గతంలో రూ.55 నుంచి రూ.58 మధ్య ఉండేది. ఇప్పుడు సగటున రూ.64 నుంచి రూ.68 వరకు ఉంది. నెలకు 30 లీటర్లకు రూ.300 అదనంగా ఖర్చవుతోంది. సబ్బులు, డిటర్జెంట్ ఉత్పత్తుల ధరలూ.. 30 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వీటికి తోడు ఇంట్లో వాడే ఒంటి సబ్బులు,ఫేస్‌క్రీమ్, షాంపూ ధరలూ రెట్టింపయ్యాయి. పాత్రలు కడిగే సబ్బు ధర మూడేళ్ల కిందట రూ.45 ఉంటే ఇప్పుడు అది 51 శాతం పెరిగి.. రూ.68కి చేరింది. టూత్‌పేస్ట్ ధర 2019లో రూ.79 ఉంటే.. ఇప్పుడు రూ.96 రూపాయలకు పైగానే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల వస్తువులపైనా ధరలు పెరిగాయి. ఉల్లిపాయల ధరలు 25కిలో దగగ్గర స్థిరంగా ఉన్నాయి. అయితే ఇవన్నీ కూడా తగ్గింప ప్రయత్నాలు చేయడం లేదు.

# కలెక్టర్ ఆర్థిక చేయూత



**ప్రజానావ, సిరిసిల్ల:** అనారోగ్య, ఆర్థిక కారణాలతో ఇబ్బంది పడుతున్న మూడు కుటుంబాలకు కలెక్టర్ ఆర్థిక చేయూత అందించారు. అనారోగ్య, ఆర్థిక కారణాలతో తాము ఇబ్బంది పడుతున్నామని, తమను ఆదుకోవాలని, ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తంగళ్ళపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన దాసరి మల్లవ్వ, కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట కళావతి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన సింగం నర్సయ్య విన్నవించారు. ఆయా కుటుంబాల స్థితిగతులు చూసి చలించిన కలెక్టర్ ... వెంటనే ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో ఆయా కుటుంబాల బాధ్యులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు. వారంలోగానే తమకు ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ కు ఆయా కుటుంబాల బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కులగణన నిర్ణయం సంచలనం

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు

**ప్రజానావ, సిరిసిల్ల:** కేంద్ర ప్రభుత్వం కులగణన మీద తీసుకున్న నిర్ణయం సంచలనమని బీజేపీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఏదైతే సంచలన నిర్ణయాలు బీజేపీ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కులగణన మీద తీసుకున్న నిర్ణయం సంచలనమని పేర్కొన్నారు. 60 ఏండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండి, కులగణన చేయలేదన్నారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం కులగణన చేస్తే మళ్ళీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేపడుతోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలే నెరవేర్చే పరిస్థితి లేదన్నారు. రైతులకు ఇస్తామన్న ధాన్యం డబ్బులు వారం లోపల రైతులకు ఇవ్వనట్లైతే రైతుల తరఫున సంఘర్షణ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు గజబింకర్ చందు, ప్రధాన కార్యదర్శి కొండ నరేష్, ఉపాధ్యక్షులు చొప్పదండి శ్రీనివాస్, దుమాల శ్రీకాంత్, వంతడుపుల సుధాకర్, సిరిసిల్ల వంశీ, అంజన్న, గాజుల సదానందం, మోర శ్రీహరి, ఊరగొండ రాజు, గుడ్ల విష్ణు, చొప్పదండి శ్రీనివాస్, సుంకోజు రమేష్ చారి, తవటం రాజలింగం, అంకారపు రాజు, దుమాల శ్రీకాంత్, సంగీతం సత్య సాయిరాం, వేముల సురేష్, మహేశుని అనిల్, ఇంజపూరి మురళి, తాటిపాముల సత్యం, దూడం సురేష్, కొండ మణికాంత్, కొంపెల్లి మురళి, మామిడి శెట్టి శేఖర్, అభినయ్, చిలుక శ్రీకాంత్, అలవాల నరహరి, నరసింహులు, వడ్నాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# పక్కా ప్రణాళికతో ఉన్నతస్థానాలకు ఎదగాలి

## పదిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅభినందన

**ప్రజానావ, సిరిసిల్ల:** విద్యార్థులు పక్కా ప్రణాళిక, లక్ష్యంతో ఉన్నతస్థానాలకు ఎదగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అభినందించారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు విష్ణుప్రియ 580, విగ్నారెడ్డి 573, వైష్ణవి 553, అలేఖ్య 551 మార్కులు సాధించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిహర్షిత్ 573, భానుతేజ 562, నవజీత్ 561, సుశృత 558, కావ్య 545, మైత్రి 531, భవ్య 535 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించి జీవితంలో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఐఐటీ లక్ష్యంగా కష్టపడి చదువుతూ తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా విద్యాలయాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన పొన్నం



**ప్రజానావ, హైదరాబాద్:** బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు కబ్జాకు గురై తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, ఆర్డీవో ,ఎమ్మార్వో తదితర అధికారులు పరిశీలించారు. సర్వే నెంబర్ 102/1లో 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్నీ పరిశీలించి పెన్సింగ్ పై అధికారులకు పొన్నం పలు సూచనలు చేశారు. 12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో కబ్జాకు గురైన ప్రాంతంలో కూల్చివేసిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా సీఎం నిర్ణయించారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోకు అభినందనలు తెలిపారు.

# సీఎం సారూ.. కాపాడండి..

## నన్ను చంపాలని చూస్తున్నారు..

## నా స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు.

## పారిశుద్ధ కార్మికురాలు నారాయణమ్మ విజ్ఞప్తి

## తన స్థలాన్ని కబ్జా చేశారని ఆవేదన

**ప్రజానావ, ఖైరతాబాద్:** సీఎం సారూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మనుషుల నుంచి నన్ను కాపాడండి.. దానం నాగేందర్ అనుచరులు నన్ను చంపాలి చూస్తున్నారు.. అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఓ పారిశుద్ధ కార్మికురాలి విజ్ఞప్తి చేసింది. అప్పటి వైఎస్ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలాన్ని కబ్జాకు యత్నించడమే కాక, తనపై దాడులకు తెగబడుతూ కేసుల పాలు చేస్తున్న వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని కోరింది. తనకు అప్పటి ప్రభుత్వం ఫిలింనగర్ వినాయక నగర్‌లో 120 గజాల స్థలాన్ని కేటాయించిందని.. సదరు స్థలంలో ఎంతోకాలంగా జీవిస్తున్న తమను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులు స్థలాన్ని ఖాళీ చేయించారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం చేయలేదని కన్నీరు పెట్టుకున్నది. న్యాయం కోసం తిరుగుతుంటే తనపైనే కేసులు బనాయిస్తున్నారని.. ఫిలింనగర్ బస్తీల్లో స్థలాల పంపిణీల పేరుతో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు తనకు న్యాయం చేయాలని నారాయణమ్మ రేవంత్ రెడ్డిని వేడుకుంటున్నది.

# పానీపూరి బండి సీజ్




**ప్రజానావ, బెల్లంపల్లి:** ఇటీవల కాల్టెక్స్ ఏరియా బెల్లంపల్లిలోని ఒక స్టాల్ నుంచి పానీపూరి తినడం వల్ల ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురి కాగా, కలెక్టర్ఆదేశాల మేరకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ దానిని సీజ్‌చేశారు. యజమానికి రూ.5 వేల జరిమానా విధించారు. ఆహారం తీసుకోవడంలో పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ప్రజలకు సందేశం ఇచ్చారు.

# హనుమాన్ ఆలయంలో చోరీ



**ప్రజానావ, దహెగాం :** దహెగాం మండలంలోని బోర్లకుంటలో ఉన్న శ్రీ భక్తాంజనేయ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది.ఆలయం తాళం పగులగొట్టి ఆంజనేయ స్వామి వారి కిరీటం,సీతమ్మ పుస్తెలతాడు చోరీ కి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు.శనివారం ఉదయం గ్రామస్తుడు స్వామి వారి దర్శనం కోసం ఆలయానికి రాగ ఆలయం తలుపు తీసి ఉండడంతో ఆలయ అర్చకుడు నరేందర్ చారీ కి ఫోన్ చేయగా అప్పుడే అర్చకుడు వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి దర్యాప్తు చేసారు.దొంగతనానికి పాల్పడిన వారిని త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

# సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి

**ప్రజానావ, కాగజ్ నగర్ :** మండలంలోని ఎంపిక చేయబడిన 10 ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు తరగతులు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 1తేది నుండి 15వ తేది వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో విద్యార్థులకు చిత్రలేఖనం, యోగ, నృత్యం, క్రీడలు, కరాటే తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఉద్యమించాలి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే నెరవేర్చాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్



**ప్రజానావ, ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పోరేట్లకు అనుకూలంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ,వారిని చైతన్య పరిచి ప్రజా ఉద్యమాలు నిర్మించాలని ఆయన తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక బడ్జెట్ ప్రభుత్వం యొక్క కార్పోరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక ఎజెండాను ప్రతి బింబిస్తున్నదని పేర్కొన్నారు. కార్పోరేట్లకు పన్ను రాయితీలు, బడా వ్యాపారులకు రాయితీలు కొనసాగిస్తూ, ఆరోగ్యం, విద్య, గ్రామీణ ఉపాధి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సంక్షేమ పథకాలకు బడ్జెట్లో కేటాయింపులు తగ్గించారన్నారు. నిరుద్యోగం, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులను బడ్జెట్లో పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర పూర్తవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో కొన్నింటిని అమలు చేశారని, ఇంకా అమలు చేయవలసినవి చాలా ఉన్నాయన్నారు. అమలు చేసిన వాటిలో కూడా రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా పథకం విషయాలలో రైతులలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదన్నారు. ఇటీవల ప్రారంభించిన సన్నబియ్యం పథకం కూడా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిందని, అయితే మిగిలిన హామీల అమలుకు కాంగ్రెస్ పూనుకోకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వలన ఆర్థిక సంక్షోభం ఉన్నా, దీనిని అధిగమించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా 2026 మార్చి నాటికి దేశంలో నక్సల్స్ లేకుండా చేస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్ ప్రకటించి మారణహెూమం సృష్టిస్తున్నాడన్నారు . 2025లో ఆపరేషన్ కగార్ పేరుతో నక్సల్ను తుదిముట్టిస్తున్నారని, భద్రతా దళాలను రంగంలోకి దించి, వేల మంది భద్రతా దళాలు, పోలీసులు, అత్యాధునిక ఆయుధాలు, హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో ఎన్ కౌంటర్లు, హత్యలు చేస్తున్నారు. కొద్ది నెలలోనే సుమారు 150 మందికి పైగా మావోయిస్టులను ఎన్ కౌంటర్లలో హతమార్చారన్నారు. బస్తర్, బీజాపూర్, కంకర్ ప్రాంతాలలో ఎన్కౌంటర్లు పెరిగాయి, నక్సల్స్ శాంతి చర్చలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రకటన చేసినా, ప్రభుత్వం పట్టించుకోకుండా ఆపరేషన్ కొనసాగిస్తున్నదని, తెలంగాణలో శాంతి కమిటీ ఏర్పడి ప్రభుత్వం చర్చలకు పిలవాలని కోరినా, ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బస్తర్ ప్రాంతంలో ఆదివాసీలకు అండగా నిలబడుతున్న సిపిఐ పార్టీ పైన కక్షతో, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో బస్తర్ ప్రాంతంలో సిపిఐ మెరుగైన ఫలితాలు సాధించిన తర్వాత సిపిఐ నాయకుడు మనీష్ కుంజాం ఇంటిపై ఇ.డి.దాడి చేసి సోదాలు నిర్వహించడం బిజెపి తనను వ్యతిరేకించే వారిపై ప్రభుత్వ సంస్థల ద్వారా దాడులుచేసి బెదరించే ధోరణి మరోసారి రుజువైనదన్నారు . ఎన్ కౌంటర్ల ద్వారా నక్సల్స్ లను హతమార్చే ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ ఆపరేషన్ కగార్ని నిలిపి వేసి నక్సలు చర్చలకు ఆహ్వానించాలని, నక్సల్స్ కూడా ఆయుధాలు విడిచి ప్రజాస్రవంతిలోకి వచ్చి రాజకీయాలలో పాల్గొనాలని సీపీఐ పార్టీ పిలుపునిచ్చిందని ఆయన అన్నారు. ఈనెల 25 తేదీన నిర్వహించే సిపిఐ పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అంతక ముందు జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా మహాసభ నిర్వహించే తేదీలోపు ఆయా మండలాల శాఖల మహాసభలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆత్మకూరి చిరంజీవి, తాళ్లపల్లి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు సమన్వయంతో కృషి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



**ప్రజానావ, ఆసిఫాబాద్ :** జిల్లాలోని తిర్యాణి ఆస్పిరేషన్ బ్లాక్ లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో తిర్యాణి ఆస్పిరేషన్ బ్లాక్ లో 38 అంశాలపై జిల్లా శిశు సంక్షేమ, వైద్య, విద్య, పశుసంవర్ధక, వ్యవసాయ, టి ఫైబర్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత 2 సంవత్సరాల నుండి తిర్యాణి ఆస్పిరేషన్ బ్లాక్ లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా 38 అంశాలపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భం దాల్చిన వారి వివరాలను తప్పనిసరిగా పోర్టల్ లో నమోదు చేయాలని, ప్రసవం తర్వాత వివరాలు కూడా నమోదు చేయాలని, క్షయ, మధుమేహ వ్యాధిగ్రస్తుల వివరాలు అందించాలని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సకాలంలో పోషకారాన్ని అందించాలని, సామ్ మామ్ లో 6 నెలల నుండి 6 సంవత్సరాల లోపు వయసు గల పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి మానసిక, శారీరక ఎదుగుదలను పర్యవేక్షించాలని, వివరాలు పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. తిర్యాణి బ్లాక్ లోని అంగన్వాడీ కేంద్రాలలో మూత్రశాలలు, త్రాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తిర్యాణి మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో టి ఫైబర్ సౌకర్యం కల్పించాలని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని, మహిళ స్వయం సహాయక సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ బ్యాంకు రుణాలు అందించి సంఘాలను బలోపేతం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యాశాఖ అధికారులు బడి వయసు గల బడి బయట పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలని, బడి వయసు గల ఒక్కరు కూడా బయట ఉండకూడదని తెలిపారు. 10వ తరగతిలో 60 శాతం పైన మార్కులు సాధించిన వారి వివరాలను పోర్టల్ లో నమోదు చేయాలని, ప్రతి పాఠశాలలో బాలికల కొరకు ప్రత్యేక మూత్ర శాలల నిర్మాణాలు చేపట్టాలని, పాఠశాలలకు అవసరమున్న కంప్యూటర్, ప్రింటర్లు అందజేసేందుకు వివరాలు సమర్పించాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఆస్పిరేషనల్ బ్లాక్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తిర్యాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్లేష్, విద్య, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్రైమాసిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

**సింగరేణి సీఎండీ బలరాం**




**ప్రజానావ, మందమర్రి:** మొదటి త్రైమాసిక బొగ్గు ఉత్పత్తి 160 లక్షల టన్నులు చేయాలని1200 లక్షల క్యూ బిక్ మీటర్ల ఓబీని తొలగించాలని సింగరేణి సీఎండీ బల రాం ఆదేశించారు. శనివారం హైదరాబాద్లోని సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో ఈ ఏప్రిల్ లో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామని, అలాగే గత ఎడాది ఏప్రిల్ నెలలో సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో ఏప్రిల్ లో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలను సాధించాలని చైర్మన్ సూచించారు. ఒడిస్సా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాక్ లకు పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. బొగ్గు రవాణా, నాణ్యతపై సమీక్షించారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుపడతాయని వినియోగదారులు దూరమయ్యే ప్రమాదం ఉందని, నాణ్యత విషయంలో పై కిందిస్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఈ అండ్ ఎం సత్యనారాయణ రావు,డైరెక్టర్ ఆపరేషన్ ఎల్.వి. సూర్యనారాయణ డైరెక్టర్ పి పి అండ్ పర్సనల్ కే. వెంకటేశ్వర్లు, జీఎం పిపి ఏ మనోహర్, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ చంద్ర పరిగెన్, జి. ఎం. మార్కెటింగ్ రాజశేఖర్ రావు,కార్పొరేట్ జీ.ఎం.లు అన్ని ఏరియాలో జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# గంభీరావుపేటలో బంద్ ప్రశాంతం



**ప్రజానావ, గంభీరావు పేట :** పహేల్గం ఉగ్రవాదుల హత్య ఖండనకు నిరసనగా హిందూ సేవ సమితి ఆధ్వరంలో నిర్వహించిన శనివారం గంభీరావుపేట బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్కు వర్తక , వాణిజ్యాలు, హెూటల్ యజమానులు, హిందూ ముస్లిమ్, క్రైస్తవులు అన్ని కుల సంఘాలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచంలోని ఉగ్రవాదం అణిచివేతకు భారత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా భారత ప్రభుత్వానికి భారతీయులం అందరం మద్దతుగా ఉంటాం అన్నారు. అంతకముందు పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమం మండల కేంద్రానికి చెందిన అన్ని కుల సంఘాలు, వర్తక వాణిజ్యాలు, హెూటల్ యాజమాన్యాలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇండ్ల కమిటీల ఇష్టారాజ్యం

**కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇల్లు ● లైవ్‌జిల్లా అధ్యక్షుడి ఆరోపణ**



**ప్రజానావ, నేరడిగొండ :** గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీలు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నాయని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆరోపించారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్ల జాబితాను కమిటీ నిర్ణయించిన విధంగా తయారు చేసుకున్నారని అన్నారు. నిజమైన అర్హులకు ఇండ్లను కేటాయించేది కాకుండ కమిటీలు తమ ఇష్టం వచ్చిన వారిని గుర్తించి పేర్లు నమోదు చేయించారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఇండ్ల జాబితాలో అర్హుల పేర్లను తొలగిస్తూ కాంగ్రెస్ నాయకుల పేర్లను చేరుస్తున్న తీరు సరైనది కాదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంతంత మాత్రంగా ఇండ్ల పంపిణి చేస్తుంటే నిరు పేదల నుండి అట్టి అవకాశాలను కాంగ్రెస్ ఇంచార్జీలు, నాయకులు లాక్కుంటున్నారన్నారు. మండలంలో ప్రతి గ్రామ పంచాయితీ కి జనాభాను ఆధారంగా తీసుకోని ఇండ్లు మంజూరు చేయాల్సి పోంది, ఇష్టానుసారంగా చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నత అధికారులు చొరవ తీసుకోని అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

# గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు



**ప్రజానావ, వాంకిడి :** గాలి కుంటు వ్యాధి నివారణ టీకలలో భాగంగా శనివారం బాంబరా గ్రామపంచాయతీ పరిధిలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టికలు వేశారు . వాడ వాడలో తిరుగుతు పశువులకి గాలి కుంటూ వ్యాధి నివరణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ శరణ్య, పశు వైద్య సహాయకులు రాజు, గణపతి, నరేష్, వినోద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన



**ప్రజానావ, వాంకిడి :** రాజీవ్ యువ వికాస్ పథకంలో భాగంగా శనివారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎస్బిఐ మేనేజర్ నంద కృష్ణ, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కృష్ణ, ఏపీఎం మహేష్ ఆధ్వర్యంలో బంబారా, బెండరా, సామెల, గ్రామపంచాయతీలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంబారా, బెండర, సామల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమతో నాన్నకు ఉత్తమ పురస్కారం




**ప్రజానావ, నిర్మల్ టౌన్ :** నిర్మల్ ప్రముఖ వైద్యుడు డాక్టర్ వేణుగోపాలకృష్ణ స్వీయ దర్శకత్వంలో నటించిన ఉత్తమ చిత్రం ప్రేమతో నాన్న అనే చిత్రాన్ని డాక్టర్ నీలిమ సుహాసిని వివేకానంద నిర్మించి నటించారు 2024 సంవత్సరంలో ఉత్తమ చిత్రం గా ఉత్తమ నటిగా సుసిని నటుడు దర్శకుడుగా డాక్టర్ వేణుగోపాలకృష్ణ నంది పురస్కారాలు అందుకున్నారు విశిష్ట గౌరవాన్ని ప్రఖ్యాతిని పొందిన ప్రేమతో నాన్న చిత్రం మరో ఉత్తమ పురస్కారానికి ఎంపికయింది హైదరాబాద్ టాలీవుడ్ ఫిలిం ఫెస్టివల్ కి క్రియేటివ్ డైరెక్టర్ అసోసియేషన్ ఫిలిం అవార్డులకు ఎంపికైన డాక్టర్ వేణుగోపాలకృష్ణ డాక్టర్ సుహాసిని పలువురు అభినందనలు తెలిపారు

# విధులకు ఆటంకం.. వ్యక్తి రిమాండ్ ..

**ప్రజానావ, ఆదిలాబాద్ :** పట్టణంలో విధులలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్ఐకి ఆటంకపరచిన వ్యక్తి గటిక ముఖేష్ ను అరెస్టు చేసినట్టు ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మే 2న రాత్రి రవీంద్రనగర్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న క్రమంలో ఎస్ఐతో వాగ్వాదానికి దిగి పోలీస్ స్టేషన్లో ఎస్సై విధులు నిర్వర్తించకుండా ఆటంకపరిచిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ఇతనిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 219/25తో అండర్ సెక్షన్ 121 132 బి ఎన్ ఎస్ సెక్షన్లతో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం 4 మే 2025 కరీంనగర్


# ప్లే ఆఫ్ రేసులో ఆ నాలుగు జట్లు!?

ఐపీఎల్ 2025 సీజన్ 18లో ఇప్పటి వరకు 51 మ్యాచ్‌లు జరిగాయి. అట్టడుగున ఉన్న జట్ల సంగతి పక్కనబెడితే మిగిలిన జట్లలో ప్లే ఆఫ్ ఎవరు చేరుతారనేది ఆసక్తి కల్గిస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ తరువాత ఇది మరింత రసవత్తరంగా మారింది. ఐపీఎల్ 2025 సీజన్ 18 ప్లే ఆఫ్ మ్యాచ్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన 51వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ విజయంతో ప్లే ఆఫ్ రేసు ఆసక్తిగా మారింది. పది మ్యాచ్‌లు ఆడిన గుజరాత్ టైటాన్స్ 7 విజయాలతో ఏకంగా రెండో స్థానానికి చేరింది. మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో ఒక్కటి గెలిస్తే చాలు గుజరాత్ ప్లే ఆఫ్‌కు చేరుతుంది. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆడిన 10 మ్యాచ్‌లలో 6 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. మిగిలిన నాలుగు మ్యాచ్‌లు గెలిచినా 14 పాయింట్లు లభిస్తాయి. ప్లే ఆఫ్ అవకాశాలు ఈ జట్టుకు దాదాపుగా పోయినట్టే.

| | |
|---|---|
| **ముంబై ఇండియన్స్** | **11 మ్యాచ్‌లలో 14 పాయింట్లు** |
| **గుజరాత్ టైటాన్స్** | **10 మ్యాచ్‌లలో 14 పాయింట్లు** |
| **రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు** | **10 మ్యాచ్‌లలో 14 పాయింట్లు** |
| **పంజాబ్ కింగ్స్** | **10 మ్యాచ్‌లలో 13 పాయింట్లు** |
| **ఢిల్లీ కేపిటల్స్ జట్టు** | **10 మ్యాచ్‌లలో 12 పాయింట్లు** |
| **లక్నో సూపర్ జెయింట్స్ జట్టు** | **10 మ్యాచ్‌లలో 10 పాయింట్లు** |
| **కోల్‌కతా నైట్‌రైడర్స్** | **10 మ్యాచ్‌లలో 9 పాయింట్లు** |
| **రాజస్థాన్ రాయల్స్ జట్టు** | **11 మ్యాచ్‌లలో 6 పాయింట్లు** |
| **సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు** | **10 మ్యాచ్‌లలో 6 పాయింట్లు** |
| **చెన్నై సూపర్ కింగ్స్ జట్టు** | **10 మ్యాచ్‌లలో 4 పాయింట్లు** |

ఇప్పటి వరకు ఉన్న పాయింట్ల లెక్కల ప్రకారం ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు మరో మ్యాచ్ గెలిస్తే చాలు ప్లే ఆఫ్ కు చేరిపోతాయి. ఇక పంజాబ్ కింగ్స్ లెవెన్ 3 పాయింట్లు, ఢిల్లీ కేపిటల్స్ 4 పాయింట్లు సాధించాల్సి ఉంటుంది. నాలుగో ప్లే ఆఫ్ స్థానం కోసం పంజాబ్ కింగ్స్ లెవెన్ వర్సెస్‌ఢిల్లీ కేపిటల్స్ మధ్య గట్టి పోటీ ఉండవచ్చు. ఈ రెండు జట్లలోనే ఒక జట్టుకు నాలుగో ప్లే ఆఫ్ స్థానం ఖాయం కానుంది.

## బౌలింగ్ వేస్తే వికెట్ రెండు ముక్కలైంది

14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ మాయాజాలాన్ని ప్రపంచం మొత్తం చూసి ఆశ్చర్యపోయింది. మొదటి బంతికి సిక్స్ అయినా లేదా 35 బంతుల్లో సెంచరీ అయినా వైభవ్ బ్యాటింగ్‌లో పూర్తిగా ఆధిపత్యం చెలాయించాడు. కానీ ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ మరో టాలెంట్ వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్ తరఫున బ్యాటింగ్‌లోనే కాకుండా బౌలింగ్‌లో కూడా సత్తా చాటగల సామర్థ్యం వైభవ్ సూర్యవంశీకి ఉంది. రాజస్థాన్ రాయల్స్ వైభవ్ బౌలింగ్ వేసిన వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో వైభవ్ సూర్యవంశీ స్పిన్ బౌలింగ్ చేస్తున్నట్లు కనిపించింది. నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు వైభవ్ సూర్యవంశీ తన స్పిన్‌తో మాయాజాలం చేశాడు. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నిజానికి ఆ వీడియోలో వైభవ్ సూర్యవంశీ తన బౌలింగ్‌తో బ్యాటర్‌ను తీవ్రంగా ఇబ్బందిపెట్టాడు. వైభవ్ ఆ బ్యాటర్‌ను ఔట్ చేశాడు. ఇక్కడివరకు అంతా బాగానే ఉంది కానీ వైభవ్ సూర్యవంశీ తన బంతితో వికెట్‌ను రెండు ముక్కలు చేశాడు. వైభవ్ సూర్యవంశీ లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. తన తొలి మ్యాచ్‌లోనే వైభవ్ శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి ఖాతా తెరిచాడు. మొదటి మ్యాచ్‌లో తుఫాను శైలిని ప్రదర్శించిన అనంతరం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ నిజమైన భీకర రూపం కనిపించింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ తన బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించాడు. గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లోనే సెంచరీ చేసి వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ 38 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఈ విధంగా వైభవ్ ఐపీఎల్‌లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా కూడా నిలిచాడు. ఈ విషయంలో వైభవ్ సూర్యవంశీ భారత ఆటగాడు యూసుఫ్ పఠాన్ రికార్డును బద్దలు కొట్టాడు. అయితే తన మూడో మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు. ఖాతా తెరవకుండానే కేవలం 2 బంతుల్లోనే ఔటయ్యాడు.

## చెలరేగిన గుజరాత్ టాప్ ఆర్డర్?

శక్రవారం ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన ఐపీఎల్? మ్యాచ్?లో సన్?రైజర్స్? హైదరాబాద్?పై గుజరాత్ టైటాన్స్ 38 పరుగుల తేడాతో? విజయం సాధించింది. 225 పరుగుల లక్ష్యంతో ఛేజింగ్ మొదలుపెట్టిన సన్?రైజర్స్ హైదరాబాద్ మొదట్లో బాగానే ఆడినప్పటికి, మధ్యలో పరుగులు రాబట్టలేక ఇబ్బంది పడింది. దీనితో చివర్లో మెరుపులు మెరిపించినప్పటికీ ఓటమి పాలైంది. సన్?రైజర్స్? హైదరాబాద్?కు ఇది ఏడో ఓటమి.మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్? టైటాన్స్? నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ టాప్-3 బ్యాటర్లు చెలరేగి ఆడారు.శుభ్‌మన్ గిల్ (76బీ 38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), బట్లర్ (64బీ 37 బంతుల్లో 60 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు సాధించారు. సాయి సుదర్శన్ (48బీ 23 బంతుల్లో 9 ఫోర్లు) త్రుటిలో అర్ధ శతకం మిస్ అయ్యింది. కాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో జయ్‌దేవ్ ఉనద్కట్ చివరి ఓవర్‌లో 3 వికెట్లు పడగొట్టాడు. కమిన్స్, జీషాన్ అన్సారీ ఒక్కో వికెట్ సాధించారు. తాజా గెలుపుతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం కైవసం చేసుకునే అవకాశం ఉంది.తరువాత బరిలోకి దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 186 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (74బీ 41 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగి ఆడాడు. కానీ మిగతావారు విఫలం కావడంతో ఆ జట్టు ఓటమిని కొనితెచ్చుకుంది.



# ప్లే ఆఫ్స్ కు ఆర్సీబీ

### సీఎస్కేకు పీడకల మిగిల్చిన బెంగళూర్ జట్టు

ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువైంది. శనివారం చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ సింగ్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐపీ ఎల్ 2024 సీన్‌ను రీక్రియేట్ చేసింది. ఈ విజయంతో పాయింట్స్ టేబుల్‌లో ఆర్సీబీ మళ్లీ అగ్రస్థానానికి దూసుకెళ్లింది.

చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ మరోసారి సాధించింది. గతేడాది చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌ను రిపీట్ చేస్తూ.. మరోసారి ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో గెలుపొందింది. క్రితం సీజన్‌లోనూ చివరి ఓవర్‌లో అద్భుతంగా బౌలింగ్ వేసి.. సీఎస్కేకు విజయాన్ని దూరం చేసిన యశ్ దయాల్.. మరోసారి అది రిపీట్ చేశాడు. గెలుపుపై ధీమాతో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు నిరాశను మిగిల్చాడు. ఈ మ్యాచ్‌లో సీఎస్కే విజయానికి చివరి ఓవర్‌లో 15 పరుగులు అవసరం కాగా.. దయాల్ మ్యాజిక్‌తో ఆర్సీబీ.. 2 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఐపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో టాప్‌లోకి వెళ్లాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం ఆర్సీబీ కీలకం. అందుకే ఫస్టు బ్యాటింగ్‌కు దిగినప్పటి నుంచీ ఆ జట్టు బ్యాటర్లు ఎదురుదాడికి దిగారు. చివర్లో రొమారియో షెఫర్డ్.. విధ్వంసాన్ని మరో లెవెల్‌కు తీసుకెళ్లాడు. ఏకంగా 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ స్కోరు చేశాడు. విరాట్ కోహ్లీ (62), జాకబ్ బెథెల్ (55) రన్స్ కూడా రాణించడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 213 రన్స్ స్కోరు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. రుతురాజ్ గైక్వాడ్ గాయంతో దూరం కావడంతో జట్టులోకి వచ్చిన ఆయుశ్ మాత్రే చెలరేగిపోయాడు. ముఖ్యంగా ఐపీఎల్‌లో విజయవంతమైన బౌలర్లలో ఒకడిగా ఉన్న భువనేశ్వర్ కుమార్‌కు 17 ఏళ్ల మాత్రే.. చుక్కలు చూపించాడు. అతడు వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో ఏకంగా 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 26 పరుగులు పిండుకున్నాడు. ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించాడు. అతడికి రవీంద్ర జడేజా (45 బంతుల్లో 77 రన్స్ నాటౌట్) కూడా తోడవడంతో సీఎస్కే విజయం దిశగా దూసుకెళ్లింది.

అయితే 114 పరుగుల భాగస్వామ్యం తర్వాత ఆయుశ్ మాత్రే (48 బంతుల్లో 94 రన్స్) ఔట్ అయ్యాడు. అప్పటికి సీఎస్కే విజయానికి ఇంకా 22 బంతుల్లో 43 రన్స్ అవసరం. ధోనీ, బ్రెవిస్, దూబె లాంటి హిట్టర్లు ఇంకా బ్యాటింగ్‌కు రావాల్సి ఉండటంతో ఆ జట్టు విజయంపై ధీమాగానే ఉంది.

**అద్భుతం చేసిన దయాల్..**

ఐపీఎల్ 2024లో ఇటువంటి సమయంలోనే బౌలింగ్‌కు వచ్చిన దయాల్.. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించి ఆర్సీబీ ప్లే ఆఫ్స్ చేరడంలో ముఖ్య భూమిక పోషించాడు. ఈ మ్యాచ్‌లోనూ అదే చేశాడు. తొలి రెండు బంతులకు సింగిల్స్ మాత్రమే వచ్చాయి. కానీ మూడో బంతికి ధోనీని ఔట్ చేసి బ్రేక్ ఇచ్చాడు దయాల్. అయితే నాలుగో బంతిని దూబె స్టాండ్స్‌లోకి పంపించడం.. అది కాస్తా నోబాల్ కావడంతో సీఎస్కే ఫ్యాన్స్ గెలిచేశామని సంబుర పడ్డారు. కానీ ఆ తర్వాత కట్టుదిట్టమైన బంతులేసి దయాల్.. దూబె, జడేజాలను కట్టడి చేసి మరో మూడు సింగిల్స్ మాత్రమే ఇచ్చాడు. దీంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ ఎడిషన్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లో ఆర్సీబీ చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో 8వ విజయాన్ని సాధించిన ఆర్సీబీ.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. ప్లే ఆఫ్స్‌కు చేరువైంది.

## హైదరాబాద్‌కి ఛాన్స్ ఉందా?

ఐపీఎల్ 2025లో సన్ రైజర్స్ హైదరాబాద్ 7వ ఓటమిని మూటగట్టుకుంది. తాజాగా గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచులోనూ ఓడిపోయి..ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. ప్లే ఆఫ్స్ రేస్ నుంచి ఇప్పటికే చెన్నై, రాజస్థాన్ ఔటయ్యాయి. అయితే ఈ రేసులో సన్ రైజర్స్ వెనకంజలో ఉన్నప్పటికీ ఆరెంజ్ ఆర్మీ జర్నీ ఇంకా క్లోజ్ అవ్వలేదు. ఇప్పటికీ టాప్ 4లోనే నిలించేందుకు సన్ రైజర్స్ కు ఛాన్స్ ఉంది. ఎలాగో చూద్దాం. ఈ సీజన్ లో సన్ రైజర్స్ ఇప్పటి వరకు 10 మ్యాచులు ఆడింది. ఇందులో మూడు మ్యాచుల్లో నెగ్గింది. 7 మ్యాచులు ఓడిపోయింది. ప్రస్తుతం ఆరెంజ్ ఆర్మీ 6 పాయింట్లతో తొమ్మిదవ స్థానంలో కొనసాగుతోంది. దీంతో సన్ రైజర్స్ ప్లే ఆఫ్స్ కు చేరడం ఎలాగోనని అభిమానులు లెక్కలేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఆర్ హెచ్ టాప్ 4లో నిలిచేందుకు 8 నుంచి 10శాతం అవకాశం ఉంది. సన్ రైజర్స్ ఈ సీజన్ లో ఇంకా 4 మ్యాచులు ఆడాల్సి ఉంది. టాప్ 4లో నిలవాలంటే ఇకపై అన్ని మ్యాచుల్లో కచ్చితంగా విజయం సాధించాల్సి ఉంది. అప్పుడే 7 విజయాలు 14 పాయింట్లతో టాప్ 4 రేసులో ఉంటుంది. గతంలో చాలా సార్లు 14 పాయింట్లతో పలు జట్లు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించాయి. ఈ లెక్కన ఈసారి సన్ రైజర్స్ కూడా ఆ విధంగానే టాప్ లో నిలిచే అవకాశం ఉంది. అయితే సన్ రైజర్స్ నెట్ రన్ రేట్ ఘోరంగా ఉంది. అందుకే హైదరాబాద్ కు భారీ విజయాలు అవసరం ఉన్నాయి. మూడు కంటే ఎక్కువ జట్లు 14కు మించి ఎక్కువ పాయింట్లను సంపాదించకూడదు. అప్పుడే సన్ రైజర్స్ 14 పాయింట్లతో టాప్ 4లో ఉంటుంది. ఇక్కడ నెట్ రన్ రేట్ అత్యంత కీలకం. రన్ రేట్ మెరుగ్గా లేనట్లయితే అసాధ్యం. ఈ లెక్కన హైదరాబాద్ ఇతర జట్ల ఫలితాలపైనా ఆధారపడాల్సింది. ముఖ్యంగా ముంబై, ఆర్సీబీ , గుజరాత్, పంజాబ్ తదుపరి మ్యాచ్ ల ఫలితాలు సన్ రైజర్స్ క్వాలిఫైయింగ్ అవకాశాలపై ప్రభావం చూపుతాయి. హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్ లు ఢిల్లీ, కోల్ కతా, ఆర్సీబీ, లఖ్ నవూ జట్లతో తలపడాల్సి ఉంటుంది. ఇందులో ఒక్క మ్యాచులో ఓడినా సన్ రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. గత ఏడాది ఆర్సీబీ ఒక్క శాతం అవకాశంను కూడా వదలకుండా పోరాడి టాప్ 4లోకి దూసుకువచ్చింది. ఈసారి అదే స్ఫూర్తితో సన్ రైజర్స్ పోరాడితే ప్లే బెర్త్ ఖాయం చేసుకోవడం పక్కా. అయితే ఈ ప్రెడిక్షన్ కాస్త కష్టంగానే ఉన్నా అసాధ్యమేమీ అవ్వదు. ఐపీఎల్ వంటి టోర్నీలో చివరి వరకు ఏదైనా జరగవచ్చు. అందుకే సన్ రైజర్స్ పట్టు వదలకుండా పోరాడాల్సి ఉంది.

## వైభవ్ విషయంలో ఫ్యాన్స్ ఓపికగా ఉండాలి

ౠ్మకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి వల్ల భారత్-పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలపై ఎఫెక్ట్ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జరగాల్సిన 2025 ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ పాల్గొనడంపై గందరగోళం నెలకొంది. ఒకవేళ భారత్ లేకపోతే టోర్నీకి ఆదరణే ఉండదు. స్పాన్సర్లు కూడా ఆసక్తి కనబర్చరు. అందుకే ప్రస్తుత పరిస్థితుల కారణంగా టోర్నీ వాయిదా పడే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.'ఆసియా కప్? సెప్టెంబర్‌లో జరగనుంది. ఈసారి టోర్నీకి ఆతిథ్య హక్కులు భారత్ వద్దే ఉన్నాయి. కానీ, టోర్నీని యూఏఈ లేదా శ్రీలంక వేదికగా నిర్వహించే ఛాన్స్ ఉంది. షెడ్యూల్ కూడా ప్రకటించాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. భారత్- పాకిస్థాన్ మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో టోర్నీ నిర్వహించే అవకాశాలు చాలా తక్కువ' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి. గతంలో ఎప్పుడూ లేనట్లుగా ఈసారి గ్రాండ్?గా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. టోర్నీలో 8 జట్లు టీ20 ఫార్మాట్‌లో తలపడేలా ప్లాన్ చేశారు. కొత్తగా ఒమన్, హాంగ్ కాంగ్ ఆసియా కప్‌లో ఆడనున్నాయి. భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, హాంగ్‌కాంగ్ జట్లు పోటీ పడనున్నాయి. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించి మ్యాచ్?లు నిర్వహించేలా ప్లాన్ చేశారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల వల్ల టోర్నీ నిర్వహణే ప్రశ్నార్థకంగా మారింది.భారత సీనియర్ పురుషుల జట్టు ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఈ టూర్?లో బంగ్లాతో మూడు వన్డే, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్ పర్యటనకు కూడా భారత్ వెళ్లే అవకాశం తక్కువేనని తెలుస్తోంది. ఐసీసీ క్యాలెండర్ ఇయర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్ ఆడేందుకు వీలు ఉంది. కానీ, ఇది కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. భారత్‌కు సంబంధించిన రాష్ట్రాలపై ఆ దేశ నేత చేసిన కామెంట్స్ దీనికి కారణం' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.కాగా, ఇరు దేశాల మధ్య భద్రతా కారణాల వల్ల గతంలోనే భారత్- పాక్ ద్వైపాక్షిక సిరీస్‌లు రద్దయ్యాయి. ఈ రెండు జట్లు ప్రస్తుతం ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. అయితే ఈ విషయంలోనూ ఐసీసీ దృష్టిపెట్టాలని రీసెంట్‌గా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. మరోవైపు పాక్?తో పూర్తిగా క్రికెట్ సంబంధాలు తెంచుకోవాలని పలువురు మాజీలు అభిప్రాయపడ్డారు.

### మరో కీలక రికార్డుకు చేరువలో

## విరాట్ కోహ్లీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 జోరుగా సాగుతోంది. నేడు(మే 3) చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో అందరి చూపు ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీపైనే ఉంటుంది. చెన్నైతో జరగనున్న మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ కీలక రికార్డును సృష్టించే అవకాశం ఉంది. ఈ రోజు 51 పరుగులు చేయడం ద్వారా కింగ్ కోహ్లీ డేవిడ్ వార్నర్ రికార్డును కూడా బ్రేక్ చేయగలడు.ఐపీఎల్‌లో ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ డేవిడ్ వార్నర్ రికార్డును బ్రేక్ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం అత్యధిక పరుగుల రికార్డు డేవిడ్ వార్నర్ పేరిట ఉంది. డేవిడ్ వార్నర్ పంజాబ్ కింగ్స్‌తో జరిగిన 26 మ్యాచ్‌ల్లో 1134 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లీ చెన్నైతో జరిగిన 34 మ్యాచ్‌ల్లో 37.37 సగటు, 125.46 స్ట్రైక్ రేట్‌తో 1084 పరుగులు చేశాడు. ఇందులో 9 అర్ధ సెంచరీలు ఉన్నాయి. విరాట్ కోహ్లీ బెస్ట్ స్కోరు 90 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. ఇప్పుడు విరాట్ కోహ్లీ 51 పరుగులు చేస్తే వార్నర్ రికార్డు బ్రేక్ అవుతుంది.

**ఐపీఎల్‌లో ఒక జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు వీరే..**

| | | |
|---|---|---|
| **1. డేవిడ్ వార్నర్** | **1134 పరుగులు** | **(పంజాబ్ కింగ్స్‌పై)** |
| **2. విరాట్ కోహ్లీ** | **1130 పరుగులు** | **(ఢిల్లీ క్యాపిటల్స్‌పై)** |
| **3. విరాట్ కోహ్లీ** | **1104 పరుగులు** | **(పంజాబ్ కింగ్స్‌పై)** |
| **4. డేవిడ్ వార్నర్** | **1093 పరుగులు** | **(కేకేఆర్ పై)** |
| **5. విరాట్ కోహ్లీ** | **1084 పరుగులు** | **(సీఎస్కేపై)** |
| **6. రోహిత్ శర్మ** | **1083 పరుగులు** | **(కేకేఆర్‌పై)** |

**1100 పరుగులు చేరుకోవడానికి చేరువలో కోహ్లీ**

ఐపీఎల్‌లో చాలా పరుగులు చేసిన విరాట్ కోహ్లీ ఇప్పటివరకు ఒక జట్టుపై రెండుసార్లు 1100 ప్లస్ రన్స్ చేశాడు. విరాట్ కోహ్లీ ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ జట్టుపై ఈ ఘనత సాధించాడు. ఇప్పుడు విరాట్ కోహ్లీ చెన్నై సూపర్ కింగ్స్‌పై కూడా 1100 పరుగులు పూర్తి చేయగలడు.

## ఇంగ్లండ్ పర్యటనకు షమీ కష్టమే

- **షమీ పేలవ ప్రదర్శనపై ఆకాశ్ చోప్రా ఆందోళన**

ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేసర్ మహమ్మద్ షమీ పేలవ ప్రదర్శనపై టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ సీజన్‌లో షమీ తీవ్రంగా నిరాశపర్చాడన్నాడు. షమీ వైఫల్యం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టులోని అతని స్థానంపై ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు.ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మహమ్మద్ షమీ దారుణంగా విఫలమయ్యాడు. 3 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 48 పరుగులు ఇచ్చాడు. దాంతో అతనికి మరో ఓవర్ ఇచ్చేందుకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ భయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 38 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించింది. రూ. 10 కోట్ల భారీ ధర పెట్టి షమీని కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నిరాశే ఎదురైంది. అతని వైఫల్యం జట్టు విజయవకాశాలు దెబ్బతీసింది.ఇప్పటి వరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో షమీ 11.23 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు సమర్పించుకున్న తొలి భారత పేసర్‌గా చెత్త రికార్డ్‌ను మూటగట్టుకున్నాడు. మహమ్మద్ షమీ ప్రదర్శనపై ఓ ఛానెల్‌లో మాట్లాడిన ఆకాశ్ చోప్రా.. అతను ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లడం కష్టమేనని అభిప్రాయపడ్డాడు.'మహమ్మద్ షమీ ఐపీఎల్ ఫామ్ ఆందోళనకు గురి చేస్తోంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో షమీ లేకపోవడంతో బుమ్రా ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. ఆ సిరీస్‌లో షమీ ఉండి ఉంటే ఫలితం మరోలా ఉండేదని అంతా అనుకున్నారు. కానీ ప్రస్తుతం షమీ ఫామ్ చూస్తుంటే ఆందోళనగా ఉంది. షమీ బౌలింగ్‌లో పేస్ తగ్గింది. సరైన లెంగ్త్‌ల్లో బౌలింగ్ చేయడం లేదు. షమీ ప్రధాన బలమే పేస్. లైన్ అండ్ లెంగ్త్ బౌలింగ్. కానీ అతని బౌలింగ్‌లో నిలకడ లోపించింది. ఒకే ప్రదేశంలో బంతులు వేయలేకపోతున్నాడు.ఐపీఎల్ తర్వాత భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ షమీ ఇలాంటి బౌలింగ్‌తో ఎలా రాణిస్తాడు? గాయం తర్వాత షమీ ఇలా బౌలింగ్ చేయడం తీవ్ర నిరాశకు గురి చేసింది. గాయం నుంచి కోలుకొని గతేడాదిగా ఆడుతున్నా.. అతను ఇంకా రిథమ్ అందుకోలేదు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో మెరుగైన ప్రదర్శన చేసినప్పటికీ.. ఐపీఎల్‌లో మాత్రం అంచనాలను అందుకోలేకపోయాడు. అతని ఐపీఎల్ ప్రదర్శన ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టులోని షమీ స్థానంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.'అని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# శ్రీలీలకు లక్కీ ఛాన్స్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల.. మరో స్టార్ హీరోతో ఐటెం సాంగ్ చేసే ఛాన్స్ దక్కిందట. మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఇందులో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఇందులో ఓ మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నాడట బుచ్చిబాబు. దీని కోసం రామ్ చరణ్ సరసన శ్రీ లీల స్టెప్పులు చేయబోతోందట. ఈ ఫుల్ ఎనర్జిటిక్ మాస్ సాంగ్‌తో థియేటర్ దద్దరిల్లేలా చేయనుందట శ్రీలీల. ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తేలినప్పటికీ ప్రజంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.





## మరోమారు జోడీ కట్టబోతున్న

# రష్మిక, విజయ్

ఆన్‌స్క్రీన్‌పై కొన్ని జోడీలకు ప్రత్యేకమైన ఫ్యాన్స్ ఉంటారు. అలాంటి ఓ జోడీనే విజయ్ దేవరకొండ-రష్మికలదని చెప్పవచ్చు. వీరిద్దరూ కలిసి వెండితెరపై రెండుసార్లు సందడి చేశారు. వీరిద్దరూ కలిసి 'గీత గోవిందం'లో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. దీని తర్వాత 'డియర్ కామ్రేడ్'తో అలరించారు. ఈ చిత్రం కమర్షియల్‌గా హిట్ కాకపోయినప్పటికీ యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. కెరీర్‌లో ఎన్ని సినిమాలు చేసినా ఈ చిత్రం వారికెంతో ప్రత్యేకమని గతంలో విజయ్, రష్మిక ఇద్దరూ వెల్లడించారు.ఇప్పుడు ఈ జోడీ మరోసారి ప్రేక్షకులను పలకరించనున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా మైత్రీ మూవీస్ పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రి÷-లపై ఇవ్వడంతో ఆ వార్తలకు బలం చేకూరింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'కింగ్‌డమ్'తో బిజీగా ఉన్నారు. దీనితో పాటు ఆయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందనున్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే నెల నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. ఇప్పుడీ చిత్రంలో విజయ్ సరసన రష్మిక నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై నిర్మాణసంస్థ ఓ పోస్ట్ పెట్టింది. వేచి చూద్దాం అని అర్థం వచ్చేలా ఉంది. దీనికి రష్మిక ఓకే..' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేశారు. దీంతో వీరిద్దరి జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. ఇదే నిజమైతే ముచ్చటగా మూడోసారి ఈ జోడీని చూడొచ్చని సంబరపడుతున్నారు.

# చిరు సరసన నయనతార

### అనిల్ రావిపూడి చిత్రం కోసం ప్రయత్నాలు

చిరంజీవి, అనిల్ రావిపూడి కలయికలో వస్తున్న చిత్రంపై అనేకానేక ఊహాగానాలు వస్తున్నాయి. ఇందులో చిరుకు సరసన నయనతారను తీసుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో చిరుకు జోడీగా ఇద్దరు కథానాయికలు కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. కాగా, అందులో ఓ నాయిక పాత్ర కోసం నటి నయనతారను తీసుకునేందుకు చిత్ర వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు- జరిగితే ఇది చిరు - నయన్‌ల కాంబోలో హ్యాట్రిక్ సినిమా కానుంది. వీళ్లిద్దరూ గతంలో 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్ ఫాదర్' సినిమాల్లో కలిసి సందడి చేశారు. ఇక ఈ చిత్రంలో మరో పాత్ర కోసం ఓ యువ నాయికను ఖరారు చేయనున్నారు. వినోదం, యాక్షన్, కుటుంబ అంశాలతో అల్లుకున్న కథతో రూపొందనున్న చిత్రమిది. చిరంజీవి దీంట్లో శివ శంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో కనిపించనున్నారు. హీరో వెంకటేశ్ ఓ ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నారు. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

**విలేకరులు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాల్లో వెలువడుతున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల్లో, పట్టణంలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

మండలాల్లో, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్

స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి

నోట్: 'ప్రజానావ' సంస్థ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే కఠినచర్యలు తీసుకుంటాం

9676667020, 7288825681




Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**